క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

జడ్చర్ల: మండలంలోని ఖానాపూర్‌లో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య సందర్శించారు. చిన్నారుల కోసం తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, హెచ్‌ఎం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

హన్వాడ: దళితరత్న అవార్డు అందుకున్న మాల మహానాడు బ్యాగరి చెన్నయ్యను మండలంలోని పెద్దర్పల్లిలో యువకులు, మాలమహానాడు నాయకులు ఘనంగా సన్మానించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని బహుమతి అందించారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని సోమవారం 93వ రోజు రిలేదీక్ష జేఏసీ నాయకులు కొనసాగించారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని 12గ్రామాల ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. జేఏసీ కన్వీనర్ రాముినాయక్, కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల వార్షికోత్సవం నిర్వహించారు. చిన్నారులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధిక, హెచ్‌ఎం భాగ్యమ్మ, అంగన్‌వాడీ టీచర్లు నర్మద, ఎమ్మెలియా తదితరులు పాల్గొన్నారు.

కందూర్‌లో అన్నదానం



అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో స్వయంభూగా వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం మధ్యాహ్నం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. రాచూరి వేణుగోపాల్ సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ, అకౌంటెంట్ అనంతసేన్‌రావు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లిలో గణపతి, లోకేశ్వరస్వామి, సీతారాములు, కురుమూర్తి స్వామి, దీపస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపనకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. సోమవారం మంత్రి కార్యాలయంలో ఇందుకు సంబంధించిన చెక్కును గ్రామస్తులకు అందజేసి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దమందడి టీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేణుయాదవ్, ఎంపీటీసీ గణేష్, రిటైర్డ్ సీఐ దామోదర్‌రెడ్డి, శ్రీధర్, నర్సింహా, కురుమూర్తి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రసూల్ తదితరులు ఉన్నారు.

కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్‌కు చెందిన 3వ వార్డుమెంబర్ మమతా రాజురెడ్డి రూ.20వేల రైతుబంధు డబ్బులను గ్రామంలోని సీతా రామాంజనేయ ఆలయ పునఃనిర్మాణానికి విరాళంగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజీరెడ్డి, చంద్రశేఖర్, మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కాల్వ పనులు నిలిపివేయాలి

చిన్నచింతకుంట: మండలంలోని మద్దూర్‌లో అక్రమంగా చేపట్టిన కాల్వ పనులపై చర్యలు చేపట్టాలని ఉపసర్పంచ్ శేఖర్ డిమాండ్ చేశాడు. మద్దూర్ చెరువులో అక్రమంగా తవ్వుతున్న కాల్వ పనులను నిలిపి వేయాలని తహసీల్దార్ సువర్ణరాజుకు సోమవారం గ్రామ రైతులు, మత్స్య కార్మికులతో వినతిపత్రం అందజేశారు. తరాల నుంచి చెరువుకు పర్దీపూర్ రిజర్వాయర్ నుంచి కాల్వ ద్వారా ప్రతి సంవత్సరం నీరు వచ్చి చేరుతుండేది. ప్రస్తుతం కొందరు అక్రమార్కులు చెరువును ఆక్రమించి చెరువులోకి వరదనీరు, కాల్వనీరు చేరకుండా నేరుగా తూముల ద్వారా నీరంతా కిందికి వృథాగా పోయేలా చెరువుచుట్టూ కాల్వను తవ్వారని మండిపడ్డాడు. చెరువులో నీరు నిల్వ ఉండకుంటే చెరువు ఆయకట్టు కింది రైతులతో పాటు, చెరువులో చేపలు పట్టి జీవనం కొనసాగించే మత్స్య కార్మికులు దాదాపు 200 కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టి అక్రమ కాల్వ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, మత్స్య కార్మికులు కురుమన్న, రామ్మూర్తి, రమేష్, బాలరాజు ఉన్నారు.

పంచాయతీరాజ్‌లో పర్సంటేజీల పర్వం

- అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా డీఈ, ఏఈ కార్యాలయాలు



మండల ప్రజాపరిషత్ కార్యాలయం

మహబూబ్‌నగర్ రూరల్: చేసిన పనులకు నిధులు వచ్చినా.. రాకున్నా మహబూబ్‌నగర్ డివిజన్, మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులకు మాత్రం పర్సంటేజీ జేబులోకి వచ్చిపడుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చేయి తడపందే ఫైల్ ముందుకు సాగని పరిస్థితి. ప్రభుత్వం నుంచి వచ్చిన పనిని వేరే వాళ్లకు అప్పగించే బదులు సర్పంచ్‌లే అప్పులు చేసి పనులు చేశారు. బిల్లుల కోసం వచ్చే కాంట్రాక్టర్లు పర్సంటేజీలు చెల్లించాల్సిందేనన్న విధంగా శాఖ పనితీరు కనిపిస్తుంది.

సర్పంచ్ అయితే మాకేంటి..?

ప్రతి గ్రామ పంచాయతీకి నెలనెలా డబ్బులు పంపిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తుందే తప్పా 2022 ఆగస్టు నుంచి పంచాయతీలకు వచ్చే నిధులు కూడా సక్రమంగా పంపడం లేదని సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు. మండలంలో 23 జీపీలకు సర్పంచ్‌లు అధికార పార్టీ వాళ్లే కావడంతో ఏమీ చేయాలో అర్థం కాక లోలోపల కుమిలిపోతున్నామని అంటున్నారు. ఆధారాలతో అధికారుల తతంగాన్ని బయట పెడదామంటే ప్రభుత్వం పరువు పోతుందని ఆ సర్పంచులు వెనకడుగు వేయడంతో అధికారుల పర్సంటేజీల దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా జోరుగా నడుస్తుందని చర్చించుకుంటున్నారు. ఎంబీలు సరిగా చేయాలంటే డైరెక్ట్‌గానే బ్లాక్‌మెయిల్ చేసి మరీ పర్సంటేజ్ తీసుకుంటున్నారని సర్పంచ్‌లు, ప్రభుత్వ పనులు చేస్తున్న మరికొందరు ప్రజాప్రతినిధులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డివిజన్, మండల పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తమ తీరు మార్చుకొని, బిల్లులు వచ్చేవరకు పర్సంటేజ్‌ల పేరుతో ఇబ్బందులు పెట్టకుండా సహకరించాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

> **పర్సంటేజీలు అవాస్తవం..**
>
> ఎంబీ రికార్డులు చేయడానికి అధికారులు పర్సంటేజీలు తీసుకుంటున్నారనేది అవాస్తవం. అలాంటిది ఏమైనా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. చేసిన పనులకు బిల్లులు చేస్తున్నాం తప్పా బిల్లులకు డబ్బులు డిమాండ్ చేయడం లేదు.
>
> – నరేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ

సమ్మెలోకి పంచాయతీ కార్యదర్శులు..?



ముహమ్మదాబాద్‌లో నిరసన తెల్పుతున్న పంచాయతీ కార్యదర్శులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో పంచాయతీ కార్యదర్శులు ఈనెల 28 నుంచి సమ్మెకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు 34, జూనియర్ కార్యదర్శులు(జేపీఎస్) 324, ఓపీఎస్ 33 మంది ఉన్నారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే విడత వారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పోస్టుకార్డుల ఉద్యమాన్ని నిర్వహించారు. ఇందులో సీఎం కేసీఆర్‌కు కార్డుల ద్వారా డిమాండ్లను పరిష్కరించాలని వేడుకున్నారు. ప్రభుత్వం పెట్టిన నాలుగేండ్ల ప్రొబేషన్ పీరియడ్ పూర్తయినా రెగ్యులర్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ ప్రొహిబిషన్ కాలాన్ని సర్వీసు కాలంగా గుర్తించాలని, ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్యాచరణ..

- 25న డీఎస్‌ఆర్ యాప్ అన్‌ఇన్‌స్టాల్ చేయడం.
- 26న పంచాయతీ కార్యదర్శుల అధికారి వాట్సాప్ గ్రూప్‌ల నుంచి బయటకు రావడం.
- 27న జిల్లాలో ఉన్న జూనియర్ కార్యదర్శులు అందరు జిల్లా కేంద్రంలో శాంతియుత ర్యాలీ నిర్వహణ, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయడం.

హన్వాడ: నాలుగేళ్ల ప్రొబిషనరీ కాలాన్ని ముగించుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని సోమవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో పోస్ట్‌కార్డులను సీఎం కేసీఆర్‌కు పంపించారు. ఈ సందర్భంగా వారు పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట పోస్ట్‌కార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగేళ్ల పాటు విధులను నిర్వర్తించిన తమను ప్రభుత్వం గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండలానికి చెందిన గ్రామ కార్యదర్శులు మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు హాజీ, రాఘవేందర్, రవి, హన్మంతు, ప్రవల్లిక, మంగమ్మ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం కేసీఆర్‌కు వినతిని తెలియజేసేందుకు పోస్టులు రాశారు.

బాలానగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్‌కు లేఖలు రాసి పంపించారు.

మంత్రులు రాజీనామా చేయాలి

దేవరకద్ర: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రితో పాటు కేటీఆర్ రాజీనామా చేయాలని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ ఎగ్గని నర్సిములు డిమాండ్ చేశారు. సోమవారం దేవరకద్రలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30లక్షల మంది అభ్యర్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడడం సరికాదన్నారు. లీకేజీ వ్యవహారంలో బీజేపీ చేస్తున్న పోరాటంలో భాగంగా మంగళవారం పాలమూరులో నిరుద్యోగ మిలియన్ మార్చ్ చేపట్టిందని తెలిపారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయండి

కోయిల్‌కొండ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై నిరసనగా బీజేపీ పాలమూరు పోరుబాటలో పాల్గొని నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి నిరుద్యోగ మార్చ్ పోస్టర్‌ను విడుదల చేశారు.

నవాబుపేట: బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు రాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఒంటికాలిపై వీఓఏల నిరసన



జడ్చర్ల: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలు చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె సోమవారం 8వ రోజుకు చేరుకుంది. సమస్యల పరిష్కారానికి చొరవ చూపని ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఒంటి కాలుపై నిల్చొని తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం వీఓఏలకు వేతనాలను పెంచాలని, గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓలు సరస్వతి, ఫాతిమా, రమాదేవి, వసియాబేగం, సరిత, గౌతమి, అలివేలు, కల్పన, యాదమ్మ పాల్గొన్నారు.

మిడ్జిల్: సమస్యలు పరిష్కరించాలని సోమవారం మండల కేంద్రంలో వీఓఏలు ఒంటికాలిపై నిలబడి నిరసన చేపట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వసియాబేగం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు వెంకటయ్య, చెన్నయ్య, సరిత, నవనిత, దేవమణి, రాణి, రూప పాల్గొన్నారు.

నవాబుపేట: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వీఓఏలు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాములు, భీమయ్య, వెంకటయ్య, మంజుల, భార్గవి, జయమ్మ, స్వరూప పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్



విద్యార్థిని సన్మానిస్తున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా నుంచి ప్రథమ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులను కలెక్టర్ రవి నాయక్ అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో పాఠశాల స్థాయిలో మొదటి బహుమతి సాధించిన గండీడ్ మండలంలోని వెన్నచేడ్ పాఠశాలకు చెందిన విష్ణుకు, కాలేజీ స్థాయిలో జడ్చర్ల బీఆర్‌ఆర్ కాలేజీకి చెందిన రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి పొందిన ఆమనిలను కలెక్టర్ అభినందించారు. ఇందులో భాగంగా రూ.40వేల విలువ గల ల్యాప్‌ట్యాప్ అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ పాండు పాల్గొన్నారు.

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న బెక్కం జనార్దన్

మహబూబ్‌నగర్ రూరల్: బీసీ మేధావుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్, టీఎస్‌ఆర్‌జేసీ కోచింగ్ విద్యార్థులకు గొప్ప వరమని, సద్వినియోగం చేసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్దన్ అన్నారు. సోమవారం ఉచిత శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బెక్కం జనార్దన్ మాట్లాడుతూ అనువజ్ఞులైన ఉపాధ్యాయులతో పాలిటెక్నిక్, టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలో పాల్గొనే విద్యార్థులకు శిక్షణ ఇప్పించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. సంఘం అధ్యక్షుడు పాండురంగం మాట్లాడుతూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు తరగతులు ఉంటాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్, నాయకులు ఓంప్రకాష్, ఆంజనేయులుగౌడ్, రవికుమార్, ముజాహిద్, మాధవి, లత, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా జెండా పండుగ నిర్వహించాలి

నవాబుపేట: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అన్ని గ్రామాల్లో జెండా పండుగ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండాలు ఎగుర వేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ అనంతయ్య, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, రైతుబంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశం

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తికి చెందిన గంగెద్దుల అంజమ్మ భర్త ఆరునెలల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తన ముగ్గురు పిల్లలతో కలిసి బావ గంగెద్దుల మొగులప్ప ఇంట్లో ఉంటూ చుట్టు పక్కల గ్రామాల్లో తిరిగి బ్యాగులకు జిప్‌లు వేసి జీవనం సాగిస్తుంది. శనివారం ఉదయం పక్క గ్రామాలకు చిన్న కూతురిని తీసుకొని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో ఇదే గ్రామానికి చెందిన ఆవుల నర్సింహులు అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు మొగిలప్ప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

పాలమూరు: మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పిల్లలను ప్రోత్సహిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఉన్న బ్రహ్మ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులతో పాటు తల్లిదండ్రులకు న్యాయపరమైన సమస్యలతో సలహాలు, సూచనలు కావాలంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది సతీష్ కులకర్ణి, పాఠశాల వ్యవస్థాపకుడు గన్నోజు చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డికి పరామర్శ



చిన్నచింతకుంట: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు ఎగ్గని నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పర్కాపూరంలో పరామర్శించారు. దయాకర్‌రెడ్డి భార్య సీతమ్మతో మాట్లాడారు. కాగా, మెరుగైన వైద్యం కోసం దయాకర్‌రెడ్డిని హైదరాబాద్‌కు తరలించారు.

అవగాహన కల్పించాలి

మిడ్జిల్: స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానంపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఐకేపీ, మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ పథకాల కింద చేసే పనులను మంగళ, బుధ వారాల్లో గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖ, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



దేవరకద్రలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మిడ్జిల్: మండల కేంద్రంతో పాటు బోయిన్‌పల్లిలో సింగిల్ విండో ద్వారా వరి కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎంపీపీ సుదర్శన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వడ్లను విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శశిరేఖ, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అల్వాల్‌రెడ్డి, సర్పంచ్ నారన్‌రెడ్డి, రాధిక, ఎంపీటీసీ గౌస్, డైరెక్టర్లు భీమయ్య, అంజయ్య, సీఈఓ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్మన్ విజయ, ఎంపీపీ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా మొదటి రకం వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.2,060లు, రెండో రకం ధాన్యం ధర రూ.2,040ల మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ పాల్గొన్నారు.

మరో నాలుగు కేంద్రాలు..

దేవరకద్ర ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో డోకూర్, గుడిబండ, కౌకుంట్ల, గోపన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో చుట్టుపక్కల గ్రామాల రైతులు ధాన్యం అమ్ముకోవచ్చని తెలిపారు.

పనిచేసే వారికే పార్టీలో పదవులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: పార్టీలో బాధ్యతగా పనిచేసే వారికే పదవులు ఉంటాయని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలోని ఆయన పాల్గొని గ్రామ కమిటీల ఏర్పాటు, పార్టీ బలోపేతం, తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కర్వెన ప్రాజెక్టులో భూ నిర్వాసితులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని, ఇంటికో ఉద్యోగం, భూమి, భూ నిర్వాసితులకు ఇళ్లు, మూడేళ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి తదితర హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ప్రజలకు వివరించాలని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, టీపీసీసీ మైనార్టీసెల్ రాష్ట్ర నాయకుడు మహ్మద్ సాధిక్, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌పాషా, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంజీవరెడ్డి, కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్ గౌడ్, విజయ్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రతినిధుల సభ

దేవరకద్ర: బీఆర్‌ఎస్ పార్టీ 22వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మంగళవారం దేవరకద్రలో ప్రతినిధుల సభను ఏర్పాటు చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ అధ్యక్షులు జట్టి నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బాల్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగురవేసిన అనంతరం 10గంటలకు శ్రీనివాస గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



రాజాపూర్: మండలంలోని కల్లేపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం సర్పంచ్ బాలమణి భూమిపూజ చేశారు. రూ.16లక్షల నిధులు మంజూరు కాగా, అధికార పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని సర్పంచ్ పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఎట్టకేలకు భవనాన్ని నిర్మించేందుకు భూమిపూజ చేయడంతో సమస్య పరిష్కారమైంది.

ఆనంద్‌కు విశ్వజనని సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆనంద్‌కుమార్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మీ నారాయణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు ఆనంద్‌కుమార్‌కు విశ్వజనని సేవారత్న అవార్డు లభించింది. ఏపీలోనీ పల్నాడు జిల్లాలో విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం టీవీ సేవా అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సామాజిక సేవ విభాగంలో ఆనంద్‌కుమార్‌కు అవార్డు లభించింది.

సత్యసాయి ఆరాధన మహోత్సవం



గండేడ్: సత్యసాయి ఆరాధన మహోత్సవాన్ని వెన్నచేడ్‌లో నిర్వహించారు. సోమవారం సత్యసాయి ఆలయంలో స్వామి ఆరాధన మహోత్సవాన్ని చేపట్టారు. నగర సంకీర్తన, యజ్ఞం నిర్వహించారు. విద్యార్థుల సౌకర్యార్థం పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ సత్యం, అహింస, ధర్మం ఆచరించి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, భద్రయ్య, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గౌరిశంకర్, నాగేంద్రకుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం సరికాదు

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి చెప్పడం సరికాదని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న 4శాతం రిజర్వేషన్లు ముస్లిం రిజర్వేషన్లు కావని, అవి ముస్లింలలో వెనుకబడిన 12ఉపకులాలకు సంబంధించిన రిజర్వేషన్లని పేర్కొన్నారు. వీటిని అమలు చేయడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో చేసిన కృషి అందుకు నిదర్శనమని తెలిపారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు మానుకొని సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కేవలం మాటల్లో కాకుండా చేతల్లో అమలు పరిచి చూపాలని కోరారు.

నేటి నుంచి విద్యుత్ కార్మికుల సమ్మె

జడ్చర్ల టౌన్: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ 4–82 యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు యూనియన్ డివిజన్ అధ్యక్షుడు నిజామొద్దీన్, కార్యదర్శి రమేష్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమకు ఏపీఎస్‌ఈబీ రూల్స్ ప్రకారం 50శాతం పీఆర్సీ ఇవ్వాలని, యాజమాన్యం కేవలం 7శాతం మాత్రమే ఇస్తామనటం అన్యాయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లు తీర్చాలన్నారు.

కూచిపూడిలో ఉచిత శిక్షణ

జడ్చర్ల టౌన్: సాయిపూడి కళాక్షేత్రం, నటరాజ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నెలరోజుల పాటు ఉచిత కూచిపూడి నృత్య శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు శిక్షకురాలు పడాల బిందు మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావేరమ్మపేట రోడ్డులో ఉన్న జడ్చర్లప్ర భుత్వ ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వబడుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



జడ్చర్ల టౌన్: కార్మికశాఖ ఆధ్వర్యంలో స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మహబూబ్‌నగర్ లేబర్ ఆఫీసర్లు బాసిత్, అల్తాఫ్ ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు, నాగరాజు, బుక్క లక్ష్మయ్య, శ్రీనివాసులు, కేశవులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి సమీపంలో తుఫాన్ వాహనం అదుపుతప్పిన ఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలం మల్లాపురానికి చెందిన బోయ జంగిలన్న పందుల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో మరికొందరితో కలిసి వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలానికి తుఫాన్ వాహనంలో వెళ్లారు. సోమ వారం సాయంత్రం తిరుగు ప్రయాణంలో వీరి వాహనం కొమిరెడ్డిపల్లి వద్ద అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో అందులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.